సాక్షి
ఆదిలాబాద్
సోమవారం, 18, సెప్టెంబర్, 2023

రావయ్యా.. బొజ్జ గణపయ్యా



ఆదిలాబాద్: వినాయక చవితి వచ్చేసింది. గణనాథుడు వాడవాడన కొలువుదీరే సమయం ఆసన్నమైంది. తొలి పూజలందుకునేందుకు లంబోదరుడూ సిద్ధమయ్యాడు. నవరాత్రుల పాటు ఆదిదేవుడిని ఘనంగా కొలిచేందుకు భక్తగణం వేయి కళ్లతో ఎదురుచూస్తుంది.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఏడో రోజుకు అంగన్‌వాడీల సమ్మె



వంటావార్పుతో నిరసన తెలుపుతూ..

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలో భాగంగా ఆదివారం వంటావార్పు చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సంకెళ్లతో 'సమగ్ర' ఉద్యోగుల నిరసన



చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరింది. ఆదివారం కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిల్చొని చేతులకు నల్లరిబ్బన్లతో సంకెళ్లు కట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, అత్రం భుజంగ్‌రావు,నాయకులు కనక వెంకటేశ్వర్‌రావు , బొడ్డు రామేశ్వర్, వెడ్మ శ్యాంరావు, మర్సుకోల జ్ఞానేశ్వర్, కొరెంగ లక్ష్మణ్, తదితరులు మద్దతు ప్రకటించారు.

మైనార్టీలకు అవకాశం కల్పించాలి



సమావేశంలో సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్: మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా చూడకుండా, చట్టసభల్లో అడుగుపెట్టేలా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కోరారు. సీడబ్ల్యూసీ సభ్యులు నాజిర్ హుస్సేన్, సల్మాన్ ఖుర్షీద్, షకీల్ అహ్మద్, మైనార్టీ ముఖ్య నేతలతో హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో నిర్వహించిన సీడబ్ల్యూసీ మైనార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా మైనార్టీలు కాంగ్రెస్ వెంటే ఉన్నారన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులను పార్టీలో చేర్చుకోవడం వలన మైనార్టీలు కాంగ్రెస్‌కు దూరమయ్యే ప్రమాదముందని తెలిపారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీ అభ్యర్థులకు పార్టీ పక్షాన అవకాశం కల్పించాలని, విషయాన్ని ఏఐసీసీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

వీకెండ్.. విషాదం

వీకెండ్ సరదాగా గడిపేందుకు బయలుదేరిన ఆ మిత్రుల్లో నలుగురు తిరిగిరాని లోకాలకు చేరారు. మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు.

8లో▶

అవుట్‌సోర్సింగ్.. మోసాలు!

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన ఓ నిరుద్యోగి ఐటీఐ పూర్తి చేశాడు. కూలీనాలి చేస్తేనే ఆ కుటుంబ సభ్యుల జీవనం సాగేది. తనకు తెలిసిన మిత్రుడు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఉందని చెప్పడంతో తండ్రి అప్పు చేసి రూ.లక్ష ఇచ్చాడు. దీంతో ఆ యువకుడు రిమ్స్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ఆ మొత్తం ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయితే డబ్బులు తీసుకున్న సదరు వ్యక్తి ఉద్యోగం ఇప్పించకపోగా, ఏడాదిన్నరగా రేపూమాపు అంటూ తిప్పుకుంటున్నట్లు బాధితుడు వాపోయాడు.
- కుమురంభీం జిల్లా కెరమెరికి చెందిన మరో నిరుద్యోగి ల్యాబ్ టెక్నీషియన్ పూర్తి చేశాడు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగం ఇప్పిస్తానని ఈ అక్రమార్కుడే నిరుద్యోగి నుంచి రూ.లక్ష తీసుకున్నాడు. ఐదారు నెలలుగా తిప్పుకున్నాడు. దీంతో బాధితుడు ఓ రాజకీయ పార్టీ నాయకుడి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. రిమ్స్ డైరెక్టర్‌తో పాటు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో ఆ బాధితుడికి డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. ఇలా ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, ఖానాపూర్, తదితర ప్రాంతాలకు చెందిన అనేక మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి అందినకాడికి దండుకుంటున్నాడు. ఇతనొక్కడే కాదు.. అంగట్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అనేలా పలువురు ఈ దందా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో చాలామంది పెద్దల హస్తమున్నట్లు సమాచారం. ఇటీవల పలు ఘటనలు వెలుగు చూసినా ఉన్నతాధికారులు కఠిన చర్యలకు వెనుకాడడం అనుమానాలకు తావిస్తోంది.



అక్రమార్కుడి బ్యాంక్ ఖాతాలో ఓ నిరుద్యోగి జమ చేసిన డబ్బుల రశీదు

- రిమ్స్‌లో ఉద్యోగాల పేరిట దందా
- అమాయక నిరుద్యోగులే టార్గెట్
- అక్రమార్కుల్లో ఓ 'ప్రావీణ్యు'డు
- మితిమీరుతున్న ఆగడాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో అక్రమార్కుల దందా జోరుగా సాగుతోంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొంత మంది ఘరానా మోసగాళ్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రిమ్స్‌లో తవ్వినకొద్దీ బండారం బయటపడుతోంది. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్, ల్యాబ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, సెక్యూరిటీగార్డు, పేషెంట్‌కేర్, రికార్డు అసిస్టెంట్ తదితర పోస్టులు ఇప్పిస్తామంటూ వారి నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పించడం పక్కనబెడితే వారు తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు ఇటీవల అనేకం వెలుగులోకి వస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఇటీవల టర్మినెట్ చేయగా, తాజాగా మరో అక్రమ 'ప్రావీణ్యు'డి బాగోతం తెరపైకి వచ్చింది. చాలామంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు ఇప్పించకపోగా, తిరిగి ఇచ్చేందుకు ముప్పుతిప్పలు పెడుతున్నాడు. విషయం రిమ్స్‌లో బహిరంగ రహస్యమే అయినప్పటికీ రాజకీయ నాయకులు, యూనియన్ అండదండలతో అతడు తప్పించుకొని తిరుగుతున్నట్లు తెలుస్తోంది.

అక్రమాలకు పాల్పడుతున్న తీరిలా..

జిల్లాలో పలువురు అక్రమార్కులు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా రిమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని అందులో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఎక్కువ శాతం ఈ దందాకు తెరలేపుతున్నారు. కొన్ని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఆ ఏజెన్సీల వారు తమకు తెలుసని, అదేవిధంగా రాజకీయ నాయకులతో పరిచయం ఉందని మాయమాటలు చెబుతున్నారు. రిమ్స్ ఆస్పత్రితో పాటు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పడటం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉన్నాయని మోసాలకు తెర లేపుతున్నారు. విద్యార్హతలు, ఇంటర్వ్యూలు లేకుండానే కొలువు ఇప్పిస్తామని చెప్పడంతో అమాయక నిరుద్యోగులు వీరి వలలో చిక్కుకుంటున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత మోసపోయామని లబోదిబోమంటున్నారు. కొంత మంది ఈ విషయాన్ని బహిర్గతం చేస్తుండగా, మరికొంత మంది ఎవరికైనా చెబితే తమ డబ్బులు రావనే భయంతో మానసికంగా కుంగిపోతున్నారు. ఇలాంటి బాధితులు వందలాదిగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన సదరు అక్రమార్కుడు దాదాపు 50 మందికి పైగా నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. ఏకంగా గెజిటెడ్ సంతకాలు పెట్టి ఉత్తర్వులు జారీ చేయడం సంచలనం కలిగిస్తోంది. తనతో పాటు దందాలో కుటుంబీకులను కూడా కలుపుకొని ఇంటి వద్ద నుంచే ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. విధులు నిర్వహించకుండా ఇదే పనులపై దృష్టి పెడుతున్నారని రిమ్స్‌లో పనిచేసే ఉద్యోగులు సైతం పేర్కొనడం ఆయన పాల్పడిన అక్రమాలకు అద్దం పడుతోంది.

నా దృష్టికి రాలేదు..



రిమ్స్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. రిమ్స్‌లో ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగాలు లేవు. నిరుద్యోగులు మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దు. ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకురావాలి.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ

- నాటి యోధుల త్యాగాలు వెలకట్టలేనివి
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- కలెక్టరేట్‌లో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న విప్ గంప గోవర్ధన్



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న గోవర్ధన్

కైలాస్‌నగర్: ఆరు దశాబ్దాల పాటు అస్తిత్వం కోసం ఉద్యమించిన తెలంగాణ నేడు స్వరాష్ట్రమై అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన అధికారిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరుల స్తూపానికి, మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జాతీయ గీతం ఆలపించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17వ తేదీకి చరిత్రలో ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యంలోకి పరివర్తన చెందిందని అందుకే ఈ సమైక్యత వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రజల్లో దేశభక్తి భావన ఉట్టిపడేలా భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా పక్షం పాటు నిర్వహించినట్లు గుర్తు చేశారు. దానికి కొనసాగింపుగానే జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను నిర్వహించుకున్నామన్నారు. రాచరిక పాలనను ఎదిరించి రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఈ ప్రాంత యోధుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడడమే నిజమైన దేశభక్తి అని అన్నారు. సకల జనులు ఏకమై సాగించిన తెలంగాణ పోరాట చరిత్రను స్మరించుకుంటూ సాధిస్తున్న అభివృద్ధిని ఇలాగే కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమైక్యత, సమగ్రతల పరిరక్షణకు ప్రజలంతా సంఘటితమై జిల్లా సమగ్రాభివృద్ధికి పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు కుష్బూగుప్తా, శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఓటు నమోదు, దాని ప్రాధాన్యత తెలియజేసేలా ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీ విద్యార్థినుల నృత్యరూపక ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించాలని కోరుతూ డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న విప్ గోవర్ధన్, చిత్రంలో ఎమ్మెల్యే రామన్న తదితరులు

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు నివాళులర్పిస్తున్న విప్ గోవర్ధన్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కైలాస్‌నగర్:విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వేడుకలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, పంచకర్మలను సృష్టించిన విశ్వకర్మ సృష్టికే మూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తూ వాటిపై ఆధారపడ్డ వారికి అండగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.రాజలింగు, ఆర్డీవో స్రవంతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో పోలీసు అధికారులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్‌లో 4, టూటౌన్‌లో 3, మావల పోలీస్‌స్టేషన్‌లో 3 చొప్పున పది సెక్టార్లుగా విభజించి బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సెక్టార్లలో ఎస్సై, ఏఎస్సై స్థాయి అధికారులు ఇన్‌చార్జీలుగా ఉంటారని తెలిపారు. ప్రతి రెండు సెక్టార్లను క్లస్టరుగా విభజించి ఒక సీఐ అధికారి ఇన్‌చార్జీగా ఉండి 24 గంటలు పర్యవేక్షిస్తుండేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అదనంగా సున్నితమైన, ఎక్కువ ప్రజల సందర్శన ఉండే ప్రాంతాల వద్ద పికెట్స్, ఫుట్ పెట్రోలింగ్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షిస్తూ, నిరంతర సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేసేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా ఐదు నిమిషాల్లో ఘటనా స్థలానికి సిబ్బంది చేరుకునేలా నిరంతరం అప్రమత్తమై విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో మండపాల వద్ద నిర్వాహకులు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ మండపం వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది గణపతి ఉత్సవాలు, నిమజ్జనం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఉమేందర్, సీఐలు కె.సత్యనారాయణ, ఎ.అశోక్, ప్రణయ్‌కుమార్, సైదారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

- కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ రిలే దీక్ష

కైలాస్‌నగర్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ దాన్ని నిలబెట్టుకుని మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఎన్నో కమిషన్లు వేసిన కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాలో వర్గీకరణకు అనుకూలంగా సీడబ్ల్యూసీ సమావేశాల్లో తీర్మానం చేయాలని, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో కేంద్రానికి లేఖలు రాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, గణేష్, శ్రీహరి, వేణు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్లుప్తంగా

క్రికెట్ ఆడిన రైతులు




బ్యాట్ పట్టుకున్న రైతులు

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామంలో ఆదివారం రైతులు క్రికెట్ ఆడుతూ ఆనందంగా గడిపారు. గ్రామ సర్పంచ్ దెగ్లూర్ రాజు ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది రైతులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. మాజీ సర్పంచ్ రాము, నాయకులు నాగురావుపటేల్, నాగేశ్, పాండు, మారుతిపటేల్ తదితరులు పాల్గొన్నారు.

వీకెండ్.. విషాదం

- మహారాష్ట్రలో అదుపుతప్పి లోయలో పడ్డ కారు
- అక్కడికక్కడే నలుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు బ్యాంక్ ఉద్యోగులు, కారు డ్రైవర్
- అర్లి(టి) సర్పంచ్ కుమారుడు సైతం..
- తీవ్ర గాయాలతో బయటపడ్డ మరో నలుగురు



సంఘటన స్థలంలో మృతదేహాలు

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే బ్యాంక్ ఉద్యోగులు వీకెండ్‌లో సరదాగా గడిపేందుకు మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడి హిల్‌స్టేషన్‌లోని చిక్కల్‌ధార ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆదివారం తెల్లవారుజామున కారులో పయనమయ్యారు. మరికొద్ది క్షణాల్లో గమ్యస్థానానికి చేరుకోనుండగా ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో 200 అడుగుల లోతులో పడడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో డ్రైవర్‌తో పాటు మరో ఏడుగురు ప్రయాణిస్తుండగా నలుగురు తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డారు. స్నేహితుల మృతదేహాలను చూసి వారు బోరున విలపించారు. స్థానికులు మహారాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అమరావతి, పరత్వాడ ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలకు చిక్కల్‌ధర ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం అర్లి(టి) గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తోటి ఉద్యోగులు, అధికారులు సంఘటన స్థలానికి పయనం అయ్యారు.

బ్యాంకు ఉద్యోగాలతో స్నేహితులుగా మారి..

వేర్వేరు జిల్లాల్లో పుట్టి పెరిగిన వీరంతా ఉద్యోగరీత్యా ఆదిలాబాద్ జిల్లాలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏర్పడిన స్నేహంతో సరదా కోసం చేసిన వీకెండ్ ట్రిప్ విషాదాన్ని మిగిల్చింది. జిల్లాలోని వివిధ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖల్లో ఉద్యోగం చేస్తున్న యువకులకు అర్లి(టి) గ్రామానికి చెందిన షేక్ సల్మాన్‌తో స్నేహం ఏర్పడింది. సల్మాన్ సొంతంగా వాహనాన్ని నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. కాగా అర్లి(టి), భీంపూర్‌తో పాటు వివిధ బ్యాంక్ శాఖలకు అప్పుడప్పుడు జిల్లా బ్యాంకు నుంచి నగదు రవాణా కోసం ఈయన వాహనాన్ని బ్యాంకు ఉద్యోగులు అద్దెకు తీసుకునేవారు. ఈ క్రమంలో ఏర్పడిన స్నేహంతో వీరంతా కలిసి వీకెండ్ కోసం వెళ్లే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు.

మృతులు వీరే..

ఆదిలాబాద్ జిల్లాలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులతో పాటు అర్లి(టి)కి చెందిన మరో ఇద్దరు మహారాష్ట్రలోని చిక్కల్‌ధర ఆహ్లాదకర ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరి వెళ్లారు. కారు అదుపుతప్పి చిక్కల్‌ధర లోయలో పడిపోయింది. ఈ ఘటనలో భీంపూర్ మండలం అర్లి(టి) సర్పంచ్ గొల్లి రమ-లస్మన్నల కుమారుడు వైభవ్ యాదవ్ (28), అదే గ్రామానికి చెందిన షేక్‌చాంద్-రుక్సానా దంపతుల కుమారుడు, కారు డ్రైవర్ షేక్ సల్మాన్ (31), నల్గొండ జిల్లా మునుగోడు మండలం కొర్టికల్‌కు చెందిన అద్దంకి శివకృష్ణ (31), అదే జిల్లాలోని తిప్పర్తి మండలం మల్లెపల్లివారిగూడెంకు చెందిన కోటేశ్వర్‌రావు (27) అనే నలుగురు మృత్యు ఒడిలోకి చేరారు. కాగా ఖమ్మం జిల్లా పాన్నెకల్‌కు చెందిన శ్యామ్ రాజ్, నల్గొండలోని మిర్యాలగూడకు చెందిన యోగేష్‌యాదవ్, అదే జిల్లాలోని కేటపల్లి మండలం చీకటిగూడెంకు చెందిన హరీష్, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సుమన్ తీవ్ర గాయాలతో బయటపడ్డారు. కాగా మృతి చెందిన శివకృష్ణ తాంసి మండలంలోని కప్పర్ల టీజీబీ శాఖలో క్యాషియర్‌గా, కోటేశ్వర్‌రావు భీంపూర్ మండల కేంద్రంలోని టీజీబీ శాఖలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. అలాగే అర్లి(టి)కి చెందిన వైభవ్ కాటన్ కమీషన్ ఏజెంట్, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిదండ్రులు కుమారుడి మృతిని తట్టుకోలేక కుప్పకూలిపోయారు. వారు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. రాత్రి వరకు కూడా మృతదేహాలు ఇంటికి చేరుకోలేదు. ఇదిలా ఉండగా గాయపడ్డ వారిలో శ్యామ్‌రాజ్ రెడ్డి అర్లి(టి)లో క్యాషియర్‌గా, సుమన్ జైనథ్ మండలం పెండల్‌వాడలో క్యాషియర్‌గా, యోగేష్ యాదవ్, హరీష్‌లు బేల మండల కేంద్రంలో ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు జిల్లాకేంద్రంలో అద్దెకు ఉంటూ నిత్యం విధులకు హాజరవుతున్నారు. కష్టపడి కొలువు సాధించి కుటుంబాలకు అండగా ఉంటున్న తరుణంలో అనుకోని రీతిలో ఇద్దరు మృతిచెందడం వారి కుటుంబాలకు తీరని శోకం మిగిలింది. అలాగే షేక్ సల్మాన్ వాహనాన్ని కొనుగోలు చేసి తన కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. ఈ తరుణంలో కుటుంబ దిక్కు కోల్పోవడంతో విషాదం నెలకొంది. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం



ఇటీవల పొలాల పండగ వేడుకలో బసవన్నలతో షేక్ సల్మాన్, వైభవ్ (ఫైల్)

భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన షేక్ సల్మాన్, బొల్లి వైభవ్ కొన్నేళ్లుగా ప్రాణస్నేహితులుగా ఉంటున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన పొలాల అమావాస్య వేడుకల్లో సైతం ఇద్దరు కలిసి బసవన్నలను ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం పాలవడం గమనార్హం.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: మామడ మండలం దిమ్మదుర్తిలో శుక్రవారం రాత్రి జరిగిన అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం ఈ ఘటన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గ్రామానికి చెందిన రవితేజ పుట్టినరోజు సందర్భంగా బస్టాండ్ వద్దకు వెళ్లి కేక్ కట్ చేసిన అనంతరం ఆరుగురు మందు పార్టీ చేసుకున్నారు. రాజేష్‌గౌడ్, నితీశ్, దిలీప్, సంపంగి శ్రీధర్, మరో బాలుడితో కలిసి అనిల్ కుమార్ మద్యం తాగారు. ఒరేయ్..నువ్వు అంబేద్కర్ విగ్రహం పగులగొడితే నీకు కాటన్ బీర్లు తెప్పిస్తామని అనిల్‌కుమార్‌ను రెచ్చగొట్టారు. దీంతో గద్దె పైకి ఎక్కి అంబేద్కర్ విగ్రహం కుడిచేయిని తన రెండు చేతులతో విరగొట్టాడు. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో నిందితులను త్వరగా పట్టుకోవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోన్ సీఐ నవీన్ కుమార్, మామడ ఇన్‌చార్జి ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్కాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణుల సహాయంతో కేసు దర్యాప్తు చేపట్టారు. 24 గంటల్లో కేసును ఛేదించారు. వారిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సోన్ సీఐ, మామడ ఇన్‌చార్జి ఎస్సైని ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



రాజ్‌కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై ఆర్.శంకర్

ఖానాపూర్: తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్ కాలనీలోని ఓ నివాసంలో గల మొదటి అంతస్తులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కారం రాజ్‌కుమార్ కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అతడి భార్య శనివారం సాయంత్రం ఊరికి వెళ్లింది. రాజ్‌కుమార్ విధుల్లో భాగంగా స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉన్నాడు. గమనించిన దొంగలు రాత్రివేళ తాళం పగులగొట్టారు. ఇంట్లో చొరబడి 5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సమీపంలోని సాయిబాబా ఉంటున్న అద్దె ఇంటి తాళాన్ని పగులగొట్టి చొరబడ్డారు. బంగారం, నగదు దొరకలేదు. చిన్నపిల్లలు డబ్బులు పొదుపు చేసుకునే గల్ల గురిగి పగులగొట్టి చిల్లరను ఎత్తుకెళ్లారు. ఆదివారం సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం అక్కడికి చేరుకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు కేంద్రం యత్నిస్తోందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించామని తెలిపారు. సాయుధ పోరాట చరిత్ర, వాస్తవాలను ప్రజలకు వివరిస్తుందన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీనం తప్ప దేశంలోని ఇతర సంస్థానాల విలీనాల గురించి బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నైజాం అణిచివేతకు వ్యతిరేకంగా కుల మతాలకతీతంగా ప్రజలందరూ ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. నైజాంకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులు కాదని, ఆర్య సమాజం పోరాడిందని చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యం.అడివయ్య, బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థినికి హెచ్‌సీయూలో సీటు



రుమాతాయి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో బీఏ పూర్తి చేసిన ముండే రుమాతాయి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించింది. పీజీ ప్రవేశ పరీక్ష చరిత్ర విభాగంలో ఓబీసీ కేటగిరీలో జాతీయస్థాయిలో 9వ ర్యాంకు సాధించి తెలంగాణలో అత్యున్నత కేంద్రీయ విశ్వవిద్యాలయమైన హెచ్‌సీయులో సీటు దక్కించుకుంది. కళాశాల నుంచి హెచ్‌సీయూలో సీటు పొందిన తొలి విద్యార్థినిగా ఆమె చరిత్ర సృష్టించారు. ఇదే స్ఫూర్తితో చరిత్రను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకుని సివిల్స్ సాధిస్తానని సదరు విద్యార్థిని ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రూమాతాయితోపాటు చరిత్ర అధ్యాపకులు పృథ్వీరాజ్, శంకర్‌ను ప్రిన్సిపాల్ జలగం అనిత అభినందించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



సిడాం నిఖిల్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని కాండ్లీ గ్రామానికి చెందిన యువకుడు సిడాం నిఖిల్ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. నిఖిల్ ప్రభుత్వ ఉద్యోగ సాధన కోసం ఇంటివద్ద ఉండి చదువుకుంటున్నాడు. ఎన్ని పరీక్షలు రాసినా ఉద్యోగం రావడం లేదని బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజా బహదూర్ సేవలు మరువలేనివి



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్బీవీఆర్ఆర్ సొసైటీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నిజాం ప్రభుత్వంలో కొత్వాల్‌గా విధులు నిర్వహించిన రాజా బహదూర్ వెంకట్‌రామ్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివి రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ ఎక్స్‌రోడ్ వద్ద ఆర్బీవీఆర్ఆర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజాబహదూర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజ వికాసానికి మూలం స్త్రీలను విద్యాధికులుగా చేయడమేనని గాఢంగా విశ్వసించి, వారి కోసం పలు విద్యాలయాలు, హాస్టళ్లు స్థాపించారన్నారు. నిర్మల్ ఆర్బీవీఆర్ఆర్ సొసైటీ అధ్యక్షుడు అల్లోల మురళీధర్ రెడ్డి, సభ్యులు ఈ చౌరస్తాను ఆర్బీవీఆర్ఆర్ చౌరస్తాగా నామకరణం చేయాలని మంత్రికి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. విగ్రహ ఏర్పాటుకు సొసైటీ రూ.25 లక్షలు, అల్లోల మురళీధర్‌రెడ్డి రూ.21.50 లక్షలు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, సొసైటీ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని..

- పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం
- పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఘటన
- రిమ్స్‌కు తరలింపు

ఇచ్చోడ: ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ముసాయిపేట్‌కు చెందిన సుజాత (28), ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీకి చెందిన చందల హరీశ్‌కుమార్ తొమ్మిదేళ్లుగా ప్రేమించుకున్నారు. హైదరాబాద్‌లో చదువుతున్న సమయంలో వీరు ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకోకుండా తప్పించుకు తిరుగుతుండడంతో 2022 మార్చిలో ప్రియుడు ఇంటి వద్ద సుజాత బైఠాయించింది. ఈ క్రమంలో హరీశ్ తల్లిదండ్రులు నిర్మల్‌కు మకాం మార్చారు. దాదాపు 18 నెలల నుంచి సుజాత తన సమీప బంధువులతో కలిసి ప్రియుడు హరీశ్‌కుమార్ ఇంట్లో ఉంటోంది. ఆదివారం ఇరువర్గాల కుల పెద్దలతో పంచాయితీ నిర్వహించారు. ఈ వివరాలను ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించానికి వెళ్లారు. పెళ్లికి హరీశ్‌కుమార్ నిరాకరించడంతో యువతి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగింది. వెంటనే స్థానిక ఎస్సై నరేశ్ పోలీసు వాహనంలో పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ప్రసుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎస్సై వివరణ కోరగా ఇరువర్గాల కులపెద్దలు పోలీస్‌స్టేషన్ బయట మాట్లాడుకున్నారు. హరీశ్‌కుమార్ పెళ్లికి నిరాకరించడంతో పోలీస్‌స్టేషన్ గేటు బయట సుజాత పురుగుల మందు తాగినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కడెం: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పంచితి శ్రీనివాస్ శనివారం రాత్రి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని వస్తున్నాడు. చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరి వంతెన వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీనివాస్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు తేలింది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామన్నారు. అంత్యక్రియలకు వెళ్లి మద్యం తాగానని, తనను విడిపెట్టాలని ప్రాధేయపడ్డాడు. పోలీసులు వినకుండా అతడి వివరాలు తెలుసుకుని విడిచిపెట్టారు. శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పురుగు మందు డబ్బాతో వెళ్లి పోలీసులను అడ్డగించాడు. పురుగు మందు తాగేందుకు యత్నించగా వారు అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి విద్యార్థి మృతి

నిర్మల్‌టౌన్: చెరువులో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై జ్యోతి కథనం ప్రకారం.. కడెం మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన యట నరేందర్ (21), నిర్మల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ చెరువులో స్థానికులకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అతడి వివరాల కోసం అన్ని పోలీస్ స్టేషన్లను సంప్రదించారు. పాత మద్దిపడగ గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్యోతి తెలిపారు.